

రేషన్ బియ్యం పట్టివేత

అలంపూర్ చౌరస్తా, సెప్టెంబరు 29: జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలంలోని అలంపూర్ చౌరస్తా మీదుగా రాయచూరుకు తరలిస్తున్న 130 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. తెల్లవారుజామున అలంపూర్ చౌరస్తాలో అనుమానాస్పదంగా ఉన్న డీసీఎంను పోలీసులు ఆపి, తనిఖీ చేశారు. అందులో బియ్యం సంచులు ఉన్నట్లు గుర్తించారు. ఏపీలోని సత్యసాయి జిల్లాకు చెందిన డ్రైవర్ రాజశేఖర్‌ను విచారించారు. అలంపూర్, ఉండవల్లి మండలాల పరిధిలో సేకరించిన రేషన్ బియ్యాన్ని అనుమతులు లేకుండా తరలిస్తున్నట్లు గుర్తించారు. వాహనాన్ని స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పుట్ట మహేష్ తెలిపారు.



నాడు కృష్ణానదిలో పుట్టి ప్రయాణం చేస్తున్న ప్రజలు(ఫైల్)



సాయంసంధ్య వేళ సుందర దృశ్యం



తీగల వంతెన నిర్మించనున్న సోమశిల-సిద్దేశ్వరం కొండలు



కృష్ణానది తీరాన టూరిజం శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాటేజీలు

పర్యాటకం పరవళ్లు

- జాతీయ స్థాయి అవార్డు పొందిన సోమశిల గ్రామం
- కృష్ణానది, నల్లమల అందాలు, సోమేశ్వర ఆలయంతో తరలొస్తున్న పర్యాటకులు
- 2016 కృష్ణా పుష్కరాలతో దేశ ప్రజల దృష్టిని ఆకర్షించిన క్షేత్రం
- ద్వాదశ జ్యోతిర్లింగాలు ఒకే చోట ఉన్న ఏకైక లలితాంబిక సోమేశ్వరాలయం
- కృష్ణానదిపై రోప్ వే కోసం టూరిజం శాఖ ప్రతిపాదనలు



ఒకే మండపంలో ద్వాదశ జ్యోతిర్లింగాలు కలిగిన లలితాంబిక సోమేశ్వర ఆలయం

కొల్లాపూర్, సెప్టెంబరు 29: తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల సరిహద్దులో ఉన్న ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఎన్నో విశిష్టతలు.. పురాతన ఆలయాలు ఉన్నాయి. ఆ కోవకు చెందినదే నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం సోమశిల గ్రామంలోని ఏడో శతాబ్దానికి చెందిన లలితాంబిక సోమేశ్వరాలయం. ఇక్కడి నల్లమల, కృష్ణానది అందాలు, పురాతన సోమేశ్వర ఆలయం నేపథ్యంలో సోమశిలకు పర్యాటక జాతీయ అవార్డును వచ్చింది. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

స్థల పురాణం..

ఇంద్రుడి కోరికపై విశ్వకర్మ చక్రతీర్థ సమీపంలో నిర్మించిన శ్వేత శిఖరి అనే పట్టణమే ఈనాటి సోమశిలగా విరజిల్లుతోందని చరిత్ర చెబుతోంది. ఇక్కడ చంద్రుడు రాజుగా ఉంటూ సోమేశ్వరుడిని పూజించి, ఆ ఊరికి సోమేశ్వరమని పేరు పెట్టాడు. అదే క్రమంలో సోమశిలగా నామకరణమైంది. కాకతీయుల చివరి రాజైన ప్రతాపరుద్రుని శాసనాలు క్రీస్తు శకం 1295, 1297 ఆధారంగా, వారి కాలంలో సోమశిల ఓ గొప్ప పుణ్యక్షేత్రంగా విలసిల్లినట్లు ఆధారాలు ఉన్నాయి.

పునర్నిర్మాణం ఇలా...

1982లో శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణ సమయంలో కృష్ణానది నీటి ముంపునకు గురైన 117 గ్రామాల్లో సోమశిల ఒకటి. గ్రామంలోని ప్రాచీన లలితాంబిక సోమేశ్వరాలయ చరిత్ర, శిల్పకళను భావితరాలకు అందించాల్సిన అవసరాన్ని గుర్తించిన నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పురావస్తు శాఖ గ్రామ ప్రజల కోరిక మేరకు నూతనంగా ఎత్తయిన ప్రదేశంలో కృష్ణానది ఒడ్డున ఆలయాన్ని 1989లో పునఃనిర్మించారు. భారతదేశంలో అక్కడక్కడా వెలిసిన పవిత్ర ద్వాదశ జ్యోతిర్లింగాలు అన్నీ ఒకే ఆలయంలో కొలువుదీరిన మహాపుణ్యక్షేత్రంగా ఈ ఆలయం వెలుగొందుతోంది. ప్రకృతి రమణీయతతో పర్యాటకంగానూ ప్రాధాన్యం కలిగి ఉంది.



జాతీయ స్థాయి అవార్డు

పరవళ్లు తొక్కుతున్న కృష్ణానది, దట్టమైన నల్లమల అడవి, ప్రాచీన సోమేశ్వర ఆలయం కలిగిన సోమశిల గ్రామానికి ఆధ్యాత్మికం, ఆహ్లాదం, వినోదం(స్పిర్చువల్ వెల్‌నెస్) కేటగిరిలో కేంద్రం జాతీయ అవార్డును అందించింది. గ్రామంలో పర్యాటకులకు అనువుగా కృష్ణానది తీరం వెంట స్వదేశీ దర్శన్ పథకంలో రూ.ఆరు కోట్లతో కాటేజీలను నిర్మించారు. త్వరలోనే రాష్ట్ర టూరిజం శాఖ ఆధ్వర్యంలో కృష్ణానదిపై రూట్‌వే ఏర్పాటు చేసి, పర్యాటకులను మరింత ఆకర్షించేలా తెలంగాణ టూరిజం పర్యాటక శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రత్యేక దృష్టి పెట్టడంతో గ్రామం మరింత అభివృద్ధి చెందనుంది.

అందుబాటులోకి ఏసీ లాంచి..

శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణంలో నీటి ముంపునకు గురైన నాటి సోమశిల గ్రామ ప్రజలు రాయలసీమకు వెళ్లేందుకు కృష్ణానదిపై ప్రమాదభరితంగా పుట్టిలో ప్రయాణం చేసేవారు. కాలక్రమేణా ప్రభుత్వాలు మారడం, అభివృద్ధి చెందడంతో భక్తులు, పర్యాటకుల కోసం ఏసీ లాంచ్‌ను అందుబాటులోకి తెచ్చారు.

తీగల వంతెన మంజూరుతో మరింత ప్రసిద్ధి

సోమశిల-సిద్దేశ్వరం కొండల మధ్య కృష్ణానదిపై ఐకానిక్ తీగల వంతెన నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఈ ప్రాంతం మరింత ప్రసిద్ధి చెందనుంది. బ్రిడ్జి నిర్మాణానికి రూ.1,100 కోట్ల నిధులు మంజూరు చేయడంతో పాటు టెండర్లు పూర్తయ్యాయి. దాంతో ఈ ప్రాంతం రాబోయే పుష్కరాల వరకు మరింత అభివృద్ధి కానుంది. తెలుగు రాష్ట్రాల ప్రజలే కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న పర్యాటకులు ఈ ప్రాంతాన్ని సందర్శించేలా ప్రభుత్వం దీన్ని మరింత అభివృద్ధి చేయనుంది.

ప్రపంచ పర్యాటకుల దృష్టిని ఆకర్షించేలా కృషి

ప్రపంచ పర్యాటకుల దృష్టిని ఆకర్షించేలా సోమశిల గ్రామంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో కృషి చేస్తున్నాం. ఇప్పటికే తెలంగాణ టూరిజం శాఖ, పురావస్తు శాఖ ఆధ్వర్యంలో ఆధ్యాత్మికంగా విరజిల్లేలా ముందుకెళ్తున్నాం.
- జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి

పుష్కరాలతో..

1992లో మొదటిసారి సోమశిల వద్ద కృష్ణా పుష్కరాలు ప్రారంభమయ్యాయి. 12 ఏళ్ల తర్వాత 2016 ఆగస్టులో మళ్లీ పుష్కరాలను నిర్వహించారు. అప్పుడే సోమశిల దేశప్రజల దృష్టిని ఆకర్షించింది. తెలుగు రాష్ట్రాలతోపాటు వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చిన భక్తులు కృష్ణా నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు.

టైగర్ సఫారీ రెడీ

- నల్లమలలో నేటితో ముగియనున్న మూడు మాసాల నిషేధం
- రేపటి నుంచి 9 నెలల పాటు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో జంగిల్ సఫారీ సేవలు
- వాహనాలను సిద్ధం చేసిన అటవీశాఖ



టైగర్ సఫారీ వాహనాలు(ఫైల్)



నల్లమల అడవిలో సంచరిస్తున్న జింకలు

మన్ననూర్, సెప్టెంబరు 29: నల్లమలలో టైగర్ సఫారీ సేవలను అటవీశాఖ మంగళవారం నుంచి పునఃప్రారంభించనుంది. వన్య ప్రాణుల సంతానోత్పత్తి సమయం కావడంతో ఏటా జూలై ఒకటి నుంచి సెప్టెంబరు 30 వరకు మూడు నెలలు టైగర్ సఫారీ సేవలను బంద్ చేస్తారు. ఆ సమయం ముగియడంతో అక్టోబరు ఒకటి నుంచి సేవలను కొనసాగించనుంది. పర్యాటకులు టైగర్ స్టే నల్లమల పేరుతో ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకోవచ్చు. శ్రీశైలం వెళ్లి వచ్చే పర్యాటకుల కోసం ఆఫ్‌లైన్‌లో ఫరహాబాద్ చౌరస్తా వద్ద నుంచి సఫారీ వాహన సేవలను అందిస్తోంది.

ఈ వాహనాల్లో వెళ్తూ అడవి అందాలను, పెద్ద పులులు, చిరుతలు, నెమళ్లు, దుప్పులు, సాంబర్లు, జింకలు, అడవి కుక్కలు, ఎలుగుబంట్లు, అడవి పందులు, వివిధ రకాల పక్షులను ప్రత్యక్షంగా చూడొచ్చు. వన్యప్రాణులకు ఎలాంటి హాని కలుగకుండా అటవీ శాఖ ఏర్పాట్లు చేసింది.



ఆన్‌లైన్‌లో రెండు రోజుల పర్యటన

ఆన్‌లైన్‌లో టికెట్ బుక్ చేసుకున్న వారికి నల్లమలలో రెండు రోజులు టైగర్ సఫారీ సేవలు అందిస్తారు. ఈ విధానంలో రూ.4,500 నుంచి రూ.8,000 వరకు ప్యాకేజీ ఉంటుంది. ఏడుగురు కుటుంబ సభ్యులకు ఒక టికెట్ విలువ ఉంటుంది. పర్యాటకులు బస చేసేందుకు మన్ననూరు శీతల్ రెస్టారెంట్‌లో ఏసీ, నాన్ ఏసీ గదులను ఏర్పాటు చేశారు. పర్యాటకులు మొదటి రోజు మధ్యాహ్నం 12 గంటల వరకు మన్ననూరు చేరుకోవాల్సి ఉంటుంది. అక్కడ వారిని అటవీ శాఖ సిబ్బంది రిసీవ్ చేసుకుంటారు. వారికి కేటాయించిన కాటేజీల్లో బస చేసేందుకు ఏర్పాట్లు చేస్తారు. మధ్యాహ్నం భోజనం చేశాక, మన్ననూరులోని పర్యాటక వనమాలికలో గల ప్లాస్టిక్ రహిత జనపనార సంచుల తయారీ, విస్తరాకుల తయారీ కేంద్రాలను చూపుతారు. ప్లాస్టిక్ నిషేధానికి అటవీ శాఖ తీసుకుంటున్న చర్యలను పర్యాటకులకు వివరిస్తారు. అనంతరం బయోలాజికల్ ల్యాబ్‌కు తీసుకెళ్లి, అక్కడ వన్యప్రాణుల ఆరోగ్య పరిరక్షణకు కోసం చేసే పరీక్షల గురించి వివరిస్తారు. ప్లాస్టిక్ రీసైక్లింగ్ కేంద్రాన్ని చూపిస్తారు. అనంతరం పర్యావరణ విజ్ఞాన కేంద్రంలో పెద్ద పులులు, వన్యప్రాణులకు సంబంధించిన శరీర భాగాల ప్రదర్శనను చూపిస్తారు. అనంతరం సాయంత్రం నాలుగు గంటలకు మన్ననూరు నుంచి ఫరహాబాద్ చౌరస్తా మీదుగా వ్యూపాయింట్ వరకు టైగర్ సఫారీ వాహనాల్లో ప్రయాణం సాగుతుంది. అడవిలో కనిపించే వృక్ష జాతులు, వన్యప్రాణుల గురించి వివరించేందుకు అటవీ అధికారి, ఇద్దరు గైడ్లు ఉంటారు. మొదటి రోజు సాయంత్రం ఏడు గంటల వరకు వ్యూపాయింట్‌లో ప్రకృతి రమణీయ దృశ్యాలను వీక్షిస్తారు. తర్వాత వాహనాల్లో మన్ననూరులోని కాటేజీలకు చేరుస్తారు. రాత్రి వారికి కావాల్సిన భోజన ఏర్పాట్లను చేస్తారు. మరుసటి రోజు ఉదయం కాలినడన అడవిలో ట్రెక్కింగ్ చేయిస్తారు. మన్ననూరు చెక్‌పోస్టు నుంచి ఉమామహేశ్వరం వరకు మూడు కిలోమీటర్లు అడవిలో ట్రెక్కింగ్ చేయించి, ఉమామహేశ్వర ఆలయాన్ని చూపుతారు. అక్కడి నుంచి సఫారీ వాహనాల్లో మన్ననూరు చెక్‌పోస్టు వద్దకు తీసుకొస్తారు. మరో మార్గంలో ప్రతాపరుద్రుని కోటకు సైతం ట్రెక్కింగ్ తీసుకెళ్లి, మన్ననూరుకు తీసుకువస్తారు. అక్కడితో టైగర్ సఫారీ టూర్ ముగుస్తుంది.



జంగిల్ సఫారీ వెళ్లే మార్గం

ఆఫ్‌లైన్‌లో ఇలా..

ఆఫ్‌లైన్‌లో వెళ్లే వారికి ఫరహాబాద్ చౌరస్తా వద్ద ప్రతీ రోజు ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సఫారీ సేవలు అందుబాటులో ఉంటాయి. ఏడు గురికి రూ.1,200 టికెట్ ధర ఉంటుంది. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ కోసం ఏడు సఫారీ వాహనాలను అందుబాటులో ఉండగా, స్థానిక యువకులు 12 మంది డ్రైవర్లుగా, 12 మంది చెంచులను నేచురల్ గైడ్లుగా నియమించారు. అక్టోబరు రెండు నుంచి 16 వరకు దసరా సెలవులు ఇవ్వనుండటంతో టైగర్ సఫారీకి పర్యాటకులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉంది.

వ్యాన్‌ను ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

- 11 మందికి గాయాలు
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లా తలగాసిపల్లి క్రాస్ వద్ద ఘటన
- క్షతగాత్రులు వనపర్తి జిల్లా వాసులు

గార్లదిన్నె, సెప్టెంబరు 29: అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం తలగాసిపల్లి క్రాస్ వద్ద 44వ జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున వ్యాన్‌ను వెనుక నుంచి ట్రావెల్స్ బస్సు ఢీకొన్న ప్రమాదంలో 11 మంది గాయపడ్డారు. తెలంగాణ రాష్ట్రం వనపర్తి జిల్లా కొత్తకోట మండలం పాలెం గ్రామానికి చెందిన గౌతమ్‌కుమార్, జ్యోతి దంపతులు స్వగ్రామం నుంచి కూలీలను పనుల నిమిత్తం బెంగళూరుకు తీసుకెళ్తుండేవారు. అందులో భాగంగా గౌతమ్‌కుమార్, జ్యోతి 11 నెలలు క్రితం సుమారు 25 మంది కూలీలను బెంగళూరులో అపార్టుమెంట్, రోడ్ల నిర్మాణ పనులకు తీసుకెళ్లారు. దసరా పండుగ దగ్గర పడుతుండటంతో అందరూ స్వగ్రామానికి శనివారం రాత్రి బెంగళూరు నుంచి వ్యాన్‌లో బయల్దేరారు. ఆదివారం తెల్లవారుజామున 2:30 గంటల సమయంలో గార్లదిన్నె మండలం తలగాసిపల్లి క్రాస్ వద్దకు రాగానే బెంగళూరు నుంచి హైదారాబాద్ వైపు వెళ్తున్న ఏవీఎం ట్రావెల్స్ బస్సు వ్యాన్ వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో వ్యాన్‌లోని గౌతమ్‌కుమార్, జ్యోతి, లక్ష్మి, జయమ్మ, శ్రీనాథ్, చంద్రాయుడు, బస్సు క్లీనర్ ప్రమోద్, మరో నలుగురికి గాయాలయ్యాయి. వీరిలో గౌతమ్‌కుమార్, జ్యోతి, లక్ష్మి, బస్సు క్లీనర్ ప్రమోద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ మహమ్మద్ గౌస్.. చేరుకుని, గాయపడిన వారిని అనంతపురం తరలించారు. బస్సులో 50 మంది ఉండగా.. క్షేమంగా బయటపడ్డారు.

బజ్జీలు ఉద్దెర ఇవ్వలేదని..

- హోటల్ యజమానిపై వేడి నూనె పోసిన వ్యక్తి
- యజమానికి స్వల్పంగా, వెనకున్న వ్యక్తికి తీవ్రంగా గాయాలు

కేటీదొడ్డి, సెప్టెంబరు 29 : బజ్జీలు ఉద్దెరకు ఇవ్వలేదని ఓ వ్యక్తి హోటల్ యజమానిపై పొయ్యి మీద మసలుతున్న నూనె పోశాడు. దీంతో అతడితో పాటు, పక్కనే మరో వ్యక్తిపై నూనె పడి తీవ్రంగా గాయపడ్డారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలంలోని గువ్వలదిన్నెలోని ఓ హోటల్లో శనివారం రాత్రి ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బుజ్జన్న హోటల్‌కు అదే గ్రామానికి చెందిన వినోద్ బజ్జీలు తినడానికి వెళ్లాడు. ఉద్దర ఇవ్వాలని అడగడంతో, బొజ్జన్న ఇవ్వనని చెప్పాడు. ఆగ్రహించిన వినోద్ బాణలిలో కాగుతున్న నూనెను బుజ్జన్నపై పోశాడు. దాంతో బుజ్జన్నతో పాటు అతడి వెనుక ఉన్న కేటీదొడ్డి గ్రామానికి చెందిన వీరేష్‌పై వేడి నూనె పడి, ఇద్దరూ గాయపడ్డారు. స్థానికులు వెంటనే వారిని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వెనుకనున్న వీరేష్ ముఖంపై ఎక్కువ నూనె పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు అతడిని మెరుగైన చికిత్స కోసం కర్ణాటకలోని రాయచూరులో ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ మేరకు వీరేష్ భార్య శంకరమ్మ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.



చికిత్స పొందుతున్న బుజ్జన్న

కృష్ణానదికి తగ్గిన వరద ప్రవాహం

గద్వాల, సెప్టెంబరు 29: కృష్ణా నదిలో వరద ప్రవాహం పూర్తిగా తగ్గుముఖం పట్టింది. సాగునీటి శాఖ అధికారుల సమాచారం ప్రకారం.. ఆదివారం ఉదయం ఆల్మట్టి డ్యాం వద్ద 519.59 అడుగుల వద్ద నీటి నిల్వ ఉండగా, 28,108 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. 20 వేల క్యూసెక్కులను కిందికి వదులుతున్నారు. డ్యాంలో 122.834 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నారాయణపూర్ జలాశయంలో 492.25 మీటర్ల వద్ద నీరు నిల్వ ఉండగా, 22 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 17,600 క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదైంది. జలాశయంలో 33.31 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టులో 318.430 మీటర్ల వద్ద నీరు నిల్వ ఉండగా, 72 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 68,850 క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదైంది. శ్రీశైలం జలాశయంలో 885 అడుగుల వద్ద, 215.807 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

మైనింగ్ పనులను అడ్డుకోవద్దు

- అనుమతులు ఉన్నాయి : డీఎస్పీ

బల్మూరు, సెప్టెంబరు 29 : నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలంలోని మైలారం గ్రామానికి ఆనుకుని ఉన్న గుట్టకు అన్ని మైనింగ్ అనుమతులు ఉన్నాయని.. గ్రామస్తులు అడ్డుకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాస్ హెచ్చరించారు. ఆదివారం మైనింగ్ పనులు జరుగుతుండడంతో ఆటంకం కలగకుండా పనులు జరిగే చోట భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఇదిలా ఉండగా 2016-17మధ్య కాలంలో మైనింగ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. పూర్తిస్థాయి అనుమతులను పొందిన కాంట్రాక్టర్ పనులను చేపట్టాలని ప్రయత్నం చేస్తున్నప్పటికీ గ్రామస్తులు అడ్డుకోవడంతో జాప్యం జరిగింది. ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికల్లో కూడా మైలారం గ్రామస్తులు ఓటు వేయకుండా ఎన్నికలను బహిష్కరించారు. ప్రస్తుతం వారం నుంచి మైనింగ్ కాంట్రాక్టర్లు గుట్టకు రావడం, గ్రామస్థులు అడ్డుకోవడం జరుగుతున్నప్పటికీ ఆదివారం భారీ ఎత్తున పోలీసులను పెట్టడంతో మైనింగ్ కాంట్రాక్టర్ పనులను మొదలు పెట్టారు.

లంచం తీసుకున్న కానిస్టేబుల్ సస్పెన్షన్



వినోద్‌రెడ్డి, కానిస్టేబుల్

బిజినేపల్లి, సెప్టెంబరు 29 : సమస్యలతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులతో పోలీసులు వసూళ్లకు పాల్పడుతున్నాడని ఆరోపణలు రావడంతో విచారణ చేసిన నాగర్‌కర్నూల్ ఎస్పీ వైభవ్ రఘునాథ్ గైక్వాడ్ ఆదివారం సస్పెన్షన్ చేశారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని గంగారం చెందిన కల్మూరి సురేష్ అదే గ్రామానికి చెందిన అమ్మాయిని ప్రేమ వివాహం చేసుకొని గ్రామానికి వెళ్లాడు. అమ్మాయి బంధువులు దాడి చేసి యువతిని తీసుకెళ్లారు. సురేష్ వెంటనే 100కు ఫోన్ చేయగా కానిస్టేబుల్ వినోద్‌రెడ్డి గంగారం వెళ్లి కేసు డీల్ చేస్తానని రూ.2 వేలు లంచం తీసుకున్నాడు. దీంతో బాధితుడి తాత వెంకటయ్య పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఈ ఘటనపై సీఐ కనకయ్య విచారణ చేసి ఎస్పీకి నివేదిక ఇవ్వడంతో సస్పెండ్ చేశారు.

మైసమ్మ ఆలయంలో భక్తుల సందడి



నాయినోనిపల్లి మైసమ్మను దర్శనం చేసుకుంటున్న భక్తులు

పెద్దకొత్తపల్లి, సెప్టెంబరు 29 : నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలోని నాయినోనిపల్లి శివారులోని నాయినోనిపల్లి మైసమ్మ దేవతను ఆదివారం భక్తులు దర్శనం చేసుకుంటున్నారు. పలు జిల్లాల నుంచి దాదాపు 12వేల మంది భక్తులు దర్శనం చేసుకున్నారు. హుండీ ద్వారా రూ.51,056, టికెట్ల ద్వారా రూ.25,080 ఆదాయం వచ్చినట్లు ఈవో రామేశ్వరశర్మ తెలిపారు. మైసమ్మ దేవతకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నిల్లి శ్రీవర్ధన్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జాతీయ స్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థులు



బంగారు పతకాలు అందుకున్న పేట విద్యార్థులు

నారాయణపేట, సెప్టెంబరు 29 : కరాటే ఫెడరేషన్ ఇండియా చీఫ్ ఆర్గనైజర్ మహమ్మద్ ఖాజావుద్దీన్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీలలో జిల్లా కేంద్రానికి చెందిన బాలికల విభాగంలో రాజేశ్వరి, బాలుర విభాగంలో అభిలాష్ బంగారు పతకాలు సాధించారు. విద్యార్థులను అకాడమి ఫౌండర్ కేశవ్‌గౌడ్, ఖాజీఉస్సేన్, రవికుమార్, విక్రమ్, పలువురు అభినందించారు.

మహిళా హక్కుల కోసం ఉద్యమించాలి

- ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి

నాగర్‌కర్నూల్ టౌన్, సెప్టెంబరు 29: మహిళల హక్కులు, రక్షణ, కుటీర పరిశ్రమలు, ఉపాధి కల్పన కోసం అందరూ ఐక్యంగా ఉద్యమించాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సింగిల్ విండో సమావేశ మందిరంలో ఐద్వా 3వ జిల్లా మహాసభలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షురాలు నిర్మల అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం మహిళా సాధికారత కోసం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా హక్కులను కాలరాస్తోందని ధ్వజమెత్తారు. మహిళలు స్వతంత్రంగా ఎదిగేందుకు చైతన్యం కావాలని పిలుపునిచ్చారు. దేశంలో అత్యధిక సభ్యత్వం కలిగి మహిళా హక్కుల కోసం పోరాడుతున్న ఏకైన సంఘం ఐద్వా అని పేర్కొన్నారు. ఈ మహాసభలో మహిళలకు ప్రవేశపట్టిన సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని, బెల్టు షాపులను రద్దు చేసి గంజాయి డ్రగ్స్‌ను అరికట్టాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కందికొండ గీత, వెంకటమ్మ, సునీత, శ్రీలక్ష్మి, దీప, సంధ్య ఈశ్వరమ్మ, చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

2న ఉచిత ఫైబ్రో స్కానింగ్ సేవలు



డా.వివేక్‌సాగర్

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం) సెప్టెంబర్ 29 : జిల్లాకేంద్రంలోని డా. సామ్యూల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో అక్టోబర్ 2న ఉచితంగా ఫైబ్రో స్కానింగ్ సేవలు అందిస్తున్నట్లు గ్యాస్ట్రో ఎంటాలజిస్టు డా. వివేక్ సాగర్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో జీవనశైలిలో మార్పులు, ఆహార అలవాట్ల కారణంగా చాలా మంది లివర్‌కు సంబంధించిన వ్యాధులతో బాధపడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా ధూమపానం, మద్యపానం చేసే వారితో పాటు ఊబకాయం, మధుమేహం వలన ఫ్యాటీ లివర్, ఇతర వ్యాదులు వస్తున్నాయని తెలిపారు. ఇందుకు సంబం ధించి చికిత్స అందుబాటులో ఉందని, ఫైబ్రోస్కానింగ్ చేసి లివర్‌కు వచ్చిన వ్యాధి, తీసుకో వాల్సిన చికిత్స గురించి వివరించనున్నట్లు తెలిపారు. జిల్లా ప్రజల కోసం రూ. 5వేల విలువైన ఫైబ్రోస్కానింగ్‌ను తమ ఆసుపత్రిలో ఉచితంగా చేస్తున్నామని, అక్టోబర్ 2న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ సేవలు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. వివరాల కోసం ఆసుపత్రిలోని మార్కెటింగ్ మేనేజర్‌ను సంప్రదించాలని, లేదంటే 8978323181, 8096627547 నంబర్లను సంప్రదించి ముందుగానే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక



ఉమ్మడి జిల్లా జట్టు క్రీడాకారులతో అసోసియేషన్ సభ్యులు

జడ్చర్ల, సెప్టెంబరు 29 : తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం కోడ్గల్ జడ్పీహెచ్ఎస్ ఆవరణలో ఉమ్మడి జిల్లా సీనియర్ పురుషుల, మహిళల జట్టును ఎంపిక చేశారు. ఈ ఎంపిక ప్రక్రియలో 250 మంది పాల్గొనగా, 16 మంది క్రీడాకారులతో కూడిన జట్టును ఎంపిక చేశారు. మహిళ జట్టుకు రోజ, భార్గవి, శివానిచంద్ర, సంధ్య, ఇర్ఫామహేక్, శ్రీచందన, భవాని, మీనాక్షి, నందిని, సౌమ్య, సౌజన్య, ఆఫ్రీన్, నాజయ, మౌనిక, సిరీన్, రజితలను ఎంపిక చేశారు. పురుషుల జట్టుకు శివకుమార్, సుక్కురామ్, జాని, తిరుపతి, అభిలాష్, నికేశ్వర్, పవన్, మహేష్, చంద్రకాంత్, ఆసీఫ్, రియాజొద్దీన్, ప్రణయ్, రాజేష్, శ్యామ్, శ్రీను, సతీష్‌లను ఎంపిక చేశారు. అక్టోబరు 9 నుంచి 11వ తేదీలలో రంగారెడ్డి జిల్లా తోరూర్ గ్రామంలో జరిగే అంతర్‌జిల్లాల రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు శంకర్‌నాయక్, రాణి, అనురాధ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ విగ్రహావిష్కరణ సభ ఘనంగా నిర్వహిద్దాం

మన్ననూర్, సెప్టెంబరు 29 : అమ్రాబాద్ మండలం మన్ననూరు అంబేడ్కర్ చౌరస్తాలో అక్టోబరు 5న తేదీన గద్దర్ విగ్రహావిష్కరణ సభను ఘనంగా నిర్వహించుకుందామని అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. విగ్రహ పనులను ఆదివారం ఆయన ప్రారంభించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లురవి, ప్రజా సంఘాల రాష్ట్ర నాయకులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో ఎల్లస్వామి, నాసరయ్య దాసరి శ్రీనివాసులు, బుచ్చయ్య, వెంకటేశ్వర్లు, రహీం, రాజారాం పాల్గొన్నారు.

హెచ్‌సీఏ టోర్నీలో మహబూబ్‌నగర్ గెలుపు

- అర్ధ సెంచరీతో రాణించిన అబ్దుల్‌రాఫె



అబ్దుల్‌రాఫె (71)



గెలిచిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 29 : హెచ్‌సీఏ అండర్-19 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జట్టు 88 పరుగుల తేడా గెలిచింది. ఆదివారం వరంగల్ స్పోర్ట్స్ బాక్స్ స్టేడియంలో మహబూబ్‌నగర్, నల్లగొండ జట్లు తలబడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన మహబూబ్‌నగర్ జట్టు 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 186 పరుగులు చేసింది. జట్టులో అబ్దుల్ రాఫె 134 బంతుల్లో ఆరు ఫోర్లు, రెండు సిక్స్‌లతో హాఫ్ సెంచరీ (71) పరుగులు, షాదాబ్ అహ్మద్ 22, అంకిత్ 23, అభిలాష్ 16 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నల్లగొండ జట్టు 32 ఓవర్లలో 98 పరుగులకు కుప్పకూలింది. జట్టులో ఆదిత్య 35 పరుగులు సాధించాడు. జిల్లా బౌలర్లలో షాదాబ్ అహ్మద్ మూడు, కాన్షిక్ మూడు, ముఖిత్ రెండు వికెట్లు తీసి జిల్లా జట్టు విజయానికి కృషి చేశారు. జిల్లా జట్టు వరుస విజయాలు సాధించడంపై జట్టు క్రీడాకారులను, కోచ్ అబ్దుల్లాను జిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ అభినందించారు.

ఫుట్‌బాల్ ఖ్యాతిని సుస్థిరం చేయాలి

- ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఫల్గుణ

- ఏకగ్రీవంగా గద్వాల జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఎంపిక



కొత్తగా ఎంపికైన గద్వాల జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు

గద్వాల అర్బన్, సెప్టెంబరు 29 : ఫుట్‌బాల్ క్రీడకు దేశంలోనే ఖ్యాతి గడించిన గద్వాల పేరును సుస్థిరం చేసేందుకు నేటితరం క్రీడాకారులు మరింత పట్టుదలతో రాణించాలని ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జీపీ ఫల్గుణ సూచించారు. ఆదివారం పట్టణంలోని ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో ఫుట్‌బాల్ క్రీడాకారుల జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫల్గుణ మాట్లాడుతూ ప్రతిభావంతులైన క్రీడాకారులకు ఈ ప్రాంతంలో లోటులేదని, వారిని మెరికలుగా తీర్చిదిద్దేందుకు కొత్త జిల్లా అసోసియేషన్ మరింత నిబద్ధతతో శ్రమించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా బండల వెంకట్రాములు, ప్రధాన కార్యదర్శిగా వి.విజయ్‌కుమార్, కోశాధికారిగా పి.త్యాగరాజు, ఉపాధ్యక్షులుగా ఎండీ బషీర్, కే.వెంకట్రాములు, ఎల్. విష్ణు, పి.నవీన్, పి.తిరుమలేష్, జగన్, అసిస్టెంట్ సెక్రటరీలుగా కే. శివనాగరాజు, ఎం. నగేష్, కే. మధు, జాయింట్ సెక్రటరీలుగా వి. శ్రీనివాసరెడ్డి, టి. వెంకటేష్, పి. ప్రశాంత్ గౌడ్, రాజారెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా కే. ఆనంద్ కుమార్, చక్రధర్, జాడే శ్రీను, లీగల్ అడ్వైజర్లుగా పూజారి శ్రీధర్, బండల పాండుతో పాటు కార్యవర్గ సభ్యులుగా నల్లన్న, హలీం, పి.చిన్న, ఎం. కిరణ్, రాజసింహా, టి. శ్రీను, రామకృష్ణ, రాబిన్, విజయ్, కృష్ణ, వెంకటేష్, జయరాములును ఎంపిక చేశారు. సమావేశంలో డీవైఎస్ఓ బీఎస్ ఆనంద్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పి.జితేందర్, ఎస్వీ నారాయణ, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

క్రీడారంగానికి పూర్వ వైభవం తెస్తాం

-ఉమ్మడి జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్‌పీ వెంకటేష్



ఎన్‌పీ వెంకటేశ్‌ను సన్మానిస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 29: అందరి సహకారంతో జిల్లాలో క్రీడారంగానికి పూర్వవైభవం తీసుకొస్తామని ఉమ్మడి జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్‌పీ వెంకటేష్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో గల సుభాష్ కాంప్లెక్స్‌లో హనుమాన్ యూత్ క్లబ్ కార్యదర్శి పుట్టి సురేష్ ఆధ్వర్యంలో అధ్యక్షుడిగా ఎన్నికవడంతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లలో క్రీడలను బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫుట్‌బాల్ క్రీడాకారుడని, రాష్ట్రంలో క్రీడాభివృద్ధిపై సర్కార్ కృషి చేస్తుందని తెలిపారు. క్రీడల సలహాదారుడు ఏపీ జితేందర్‌రెడ్డి, శాట్‌ఛైర్మన్ శివాసేనరెడ్డి జిల్లాకు చెందిన వారేనని, వారి సహకరంతో క్రీడా రంగం అభివృద్ధి చేద్దామన్నారు. ప్రతి మూడు నెలలకోసారి జిల్లాలో అంతర్‌జిల్లాల క్రీడా టోర్నీలు నిర్వహించుకుందాం అన్నారు. డిసెంబర్ లేదా జనవరిలో జిల్లాకు చెందిన దాదాపు వెయ్యి మంది సీనియర్ క్రీడాకారులకు పెద్ద ఎత్తున సన్మాన కార్యక్రమం చేపట్టనున్నట్లు చెప్పారు. క్లబ్ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణానికి చెందిన రిటైర్డ్ పీడీలు బాలయ్య, షాకుర్‌బేగ్, ఇతర పీడీలు క్రీడారంగానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పుట్టి సురేష్‌చందర్, ప్రసాద్, రమేష్‌చందర్, దామోదర్‌రెడ్డి, నర్సింహులు, తిరుపతయ్య, రామాంజనేయులు, రాంచందర్, జాకీర్, ఆమీనుద్దీన్, దస్తగిర్‌ఖాన్, చెన్నవీరయ్య, జగదీష్, చందర్, సమాద్‌ఖాన్ పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి చంద్రమౌళి స్వామి

- శివపార్వతుల గేయ గానామృతం సీడీ..

- వీరశైవ గోత్రాలు, సూత్రాల పుస్తకం ఆవిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న సభ్యులు

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 29 : శివపార్వతుల గేయ గానమృతాన్ని రచించి పాడి సంగీతం సమకూర్చిన చంద్రమౌళి స్వామి బహుముఖ ప్రజ్ఞాశాలి అని గవిసిద్ధ మఠం పీఠాధిపతి సిద్ధి లింగ శివాచార్య మహాస్వామి అన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్ రైల్వేస్టేషన్ సమీపంలోని ఆడిటోరియంలో హన్వాడ ఘంటా మఠం చంద్రమౌళి స్వామి రచించి, పాడిన శివ పార్వతుల గేయ గానామృతం పాటలు, వీరశైవ గోత్ర సూత్రాల పుస్తకావిష్కరణ జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. సమాజంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే గురువు మార్గదర్శనం ఎంతో ముఖ్యమని చెప్పారు. జ్ఞానాన్ని పంచే వారు గురువన్నారు. జీవితానికి సార్థకత లభించాలన్నా, గుర్తింపు ఉండాలన్నా గురువు మార్గ నిర్దేశనం ఎంతో ముఖ్యమని చెప్పారు. 20ఏళ్లుగా ఎంతో కృషి చేసిన ఆయన ఎట్టకేలకు తన కల సాకారం చేసుకోవడం ఎంతో అభినందనీయమన్నారు. పుస్తక, గేయ రచయిత చంద్రమౌళి స్వామి మాట్లాడుతూ.. ఎంతో కాలంగా తనకు కలగా మారిన శివపార్వతుల గేయామృతం పాటలు పాడడం వీరశైవ గోత్ర, సూత్రాల పుస్తక రచన కార్యరూపం దాల్చడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు. ఈ సందర్భంగా పుస్తక ముద్రణకు, సీడీ రూపకల్పనకు సహకరించిన శివప్రసాద్, శైలజ, శంకర్, కృష్ణలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మహేశ్వరస్వామి, రాచాల చంద్రశేఖర్, అంపయ్యస్వామి, సంతోష్, సిద్ధేశ్వర్, ఉమాశంకర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సమాజాన్ని కదిలించేదే అసలైన కవిత్వం



కవిని సన్మానించిన సభ్యులు

మహబూబ్‌నగర్ టౌన్, సెప్టెంబరు 29 : సమాజాన్ని కదిలించేదే అసలైన కవిత్వమని, అలాంటిది ఎప్పటికీ నిలుస్తుందని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం పాలమూరు సాహితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలలో కాళోజీ హాల్‌లో జరిగిన పాలమూరు సాహితి అవార్డు 23 ప్రదానోత్సవం హరితస్వప్నం పుస్తకావిష్కరణ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పాలమూరు జిల్లా కవులకు నిలయమని, ఇక్కడి తెలుగు సాహిత్య రంగంలో విశేష కృషి చేశారన్నారు. కవిత్వంలో తాను సంఘర్షణ పడితేనే చక్కటి చిక్కటి కవిత్వం ఆవిష్కరించబడుతుందన్నారు. లోకంలోని అనేక సంఘర్షణలను కవి అనుభవంలోకి తీసుకుని కవిత్వం రాస్తాడన్నారు. కవి ఎప్పుడు సమాజంలో నిలిచే కవిత్వం రాయాలన్నారు. పద్నాలుగు సంవత్సరాలుగా పాలమూరు సాహితి కవితా సంపుటాలకు పుస్కారాలను అందజేయడం అభినందనీయమన్నారు. 2023 సంవత్సరానికి కవి డాక్టర్ బాణాల శ్రీనివాసరావు రచించిన రాత్రి సింఫని కవితాసంపుటికి అవార్డు రావడం దక్కడం కవికి దక్కిన గౌరవమన్నారు. సభకు అధ్యక్షత వహించిన ప్రముఖ న్యాయవాది వల్లపురెడ్డి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో నిరంతర సాహితి సేవ చేస్తున్న పాలమూరు సాహితి సంస్థను కొనియాడారు. విశిష్ట అతిథిగా విద్యావేత్త లక్ష్మణ్‌గౌడ్ పాల్గొన్నారు. రాత్రి సింఫని కవితా సంపుటిపై బోలయాదయ్య సమీక్ష నిర్వహించారు. కాళోజీ అవార్డు గ్రహిత, ప్రముఖ కవి కోట్ల వెంకటేశ్వరరెడ్డి రచించిన హరితస్వప్నం పుస్తకాన్ని ప్రముఖ కవి ఒద్దిరాజు ప్రవీణ్‌కుమార్ సమీక్షించారు. అనంతరం పాలమూరు సాహితి అవార్డును కవి బాణాల శ్రీనివాసరావుకు అందజేశారు. హరిత స్వప్నం పుస్తకాన్ని న్యాయవాది బుర్రి వెంకట్రామారెడ్డికి కోట్ల వెంకటేశ్వరరెడ్డి అంకితం చేశారు. కార్యక్రమంలో ఎంవీఎస్ వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, పాలమూరు సాహితి అధ్యక్షుడు, అవార్డు వ్యవస్థాపకుడు భీంపల్లి శ్రీకాంత్ తదితరులు ప్రసంగించారు.

డీ-82 కాలువకు మరమ్మతు చేపట్టండి



తెగిపోయిన కాలువ

వెల్దండ, సెప్టెంబరు 29 : నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలానికి ప్రధాన సాగునీటి వనరులైన కేఎల్ఐ డీ-82 కాలువ మరమ్మతు చేపట్టకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నెలరోజుల క్రితం లక్ష్మాపురం వద్ద కేఎల్ఐ కాలువ తెగిపోవడంతో సాగునీరు వృథాగా పోతుంది. ఇటీవల స్థానిక ఎమ్మెల్యే నారాయణరెడ్డి కాలువను సందర్శించి తక్షణమే మరమ్మతు చేపట్టాలని ఆదేశించినా సమస్య మాత్రం తీరలేదు. గండి పూడ్చకుండా నీటిని వదలడంతో నీరు ముందుకుసాగక బయటకు వచ్చి పక్కనే ఉన్న పంటలకు నష్టం వాటిల్లుతుందని రైతులు పేర్కొంటున్నారు. మండలంలో రబీ సీజన్‌లో రైతులు పెద్దఎత్తున వేరుశనగ, వరి పంటలను సాగుచేస్తారు. ఈ క్రమంలో సీజన్ ప్రారంభమైనా కాలువకు మరమ్మతు చేయకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ఇరిగేషన్ అధికారులు స్పందించి కాలువ గండిని పూడ్చాలని కోరుతున్నారు.

డీసీఎం, మినీ బస్సు ఢీ

- ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు

కొత్తకోట, సెప్టెంబరు 29 : అదుపు తప్పిన డీసీఎం మినీ బస్సును ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ చంద్రయాన్‌గుట్టకు చెందిన 12 మంది ఓ శుభకార్యంలో వంట చేయడానికి మినీ బస్సులో కర్నూల్‌కు శనివారం మధ్యరాత్రి బయలుదేరారు. కొత్తకోట బైపాస్‌కు వచ్చే సరికి వెనుక టైరు పంక్చర్ అయ్యింది. టైరు మార్చుకోవడం కోసం బస్సును పక్కకు నిలిపారు. డ్రైవర్ సయ్యద్ ముస్తఫా (33) మరో ఇద్దరి సాయంతో టైరు మార్చే పనిలో ఉండగా, హైదరాబాద్ వైపు నుంచి కర్నూల్ వెళ్తున్న డీసీఎం వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన అజీమ్, రవి నాయక్‌ను చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని సయ్యద్ ముస్తఫా మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ చెప్పారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

పంట పొలంలో మృతదేహం లభ్యం

లింగాల, సెప్టెంబరు 29 : నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండల కేంద్రం సమీపంలో ధారారం వెళ్లే ప్రధాన రహదారి మార్గంలోని ఓ వ్యవసాయ పొలంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఆదివారం లభ్యమైంది. ఘటన జరిగిన పరిసర ప్రాంతాల్లో గొర్రెల కాపరులు మృతదేహం ఉన్నట్లు గమనించి గ్రామస్తులకు తెలియజేశారు. మృతుడి వయస్సు 30-35 మధ్య ఉండగా, ఒంటిపై నలుపు రంగు ప్యాంటు, షర్టు, కుడి చేతిలో సెల్‌ఫోన్ కలిగి ఉన్నది. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ జగన్‌మోహన్‌ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని అచ్చంపేట ఆసుపత్రికి తరలించారు. ముఖం గుర్తుపట్టకుండా ఉండడంతో రెండు మూడు రోజుల కిందట జరిగినట్లు తెలుస్తుందని పోలీసులు తెలిపారు. సెల్‌ఫోన్ ఆధారంగా మృతుడి వివరాలు తెలుసుకోవడానికి పోలీసులు ప్రయత్నాలు చేస్తున్నారు.

బాలికను వేధించిన వ్యక్తి రిమాండ్

బల్మూరు, సెప్టెంబరు 29 : బాలికను లైంగికంగా వేధించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్ పంపినట్లు ఎస్ఐ గురుస్వామి ఆదివారం తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండల కేంద్రానికి చెందిన రాగిణి వంశీ ఈ నెల 25వ తేదీన బాలికకు మాయమాటలు చెప్పి తన బైకుపై మైలారం గుట్ట ప్రాంతంలో తీసుకెళ్లాడు. లైంగికదాడికి యత్నించగా ఆమె అరవడంతో అటుగా వచ్చిన వారు గుర్తించి దగ్గరికి వెళ్లడంతో పారిపోయాడు. ఈ విషయం కొంత ఆలస్యంగా వెలుగులోకి రావడంతో బాలిక అమ్మమ్మ శని వారం ఫిర్యాదు చేసింది. నిందితుడు వంశీ గతంలో పలు చోరీల కేసులో నిందితుడని తెలిపారు. ఆదివారం రిమాండ్ చేసి కల్వకుర్తి జైలుకు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

ఖిల్లాఘణపురం, సెప్టెంబరు29 : వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలంలోని మానాజీపేటకి చెందిన ఉప్పరపల్లి బాలరాజు (52) చేపలు పట్టడానికి వెళ్లి శనివారం రాత్రి బండకుంటలో మునిగి మృతి చెందినట్లు ఎస్ఐ సురేష్ గౌడ్ తెలిపారు. వలలో ప్రమాదవశాత్తు చుట్టుకొని నీటిలో మునిగిపోయి మృతి చెందినట్లు వివరించారు. భార్య అలివేల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

ఏఈఈగా బోడోనిగుట్టతండా వాసి ఎంపిక



అనిల్‌కుమార్

కోయిలకొండ, సెప్టెంబరు 29 : మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండలంలోని బోడోనిగుట్ట తండాకు చెందిన కె.అనిల్‌కుమార్ నీటి పారుదల శాఖ ఏఈఈ పోస్టుకు ఎంపికయ్యారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రం అందుకొన్నారు. మండలంలోని మారుమూల గిరిజనతండాకు చెందిన అనిల్ ఉన్నత ఆశయంతో కష్టపడి చదివి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి ఉద్యోగానికి ఎంపికైనట్లు గ్రామస్తులు తెలిపారు. అనిల్‌కు మార్‌ను ఆదివారం తండావాసులు శాలువాతో సత్కరించి అభినందించారు.

బైక్ అదుపు తప్పి మహిళకు గాయాలు

గండీడ్ , సెప్టెంబరు 29 : బైక్ అదుపు తప్పి మహిళకు గాయాలైన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా.. ఆదివారం సాయంత్రం మహబూబ్‌నగర్ నుంచి జంగంరెడ్డిపల్లికి భార్యాభర్తలు అనిల్, శివలీల బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో మండల కేంద్రంలో సర్వీస్ రోడ్డుపై మట్టి ఉండడంతో బైక్ అదుపు తప్పింది. వెనకాల కూర్చున్న శివలీల కింద పడడంతో తలకు, చేతులకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే జిల్లా ఆసుపత్రికి తరలించగా, ఆమె పరిస్థితి నిలకడగా ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

వివాహిత అదృశ్యం - కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం, సెప్టెంబరు 29 : నాగర్‌కర్నూల్ మండలంలోని నర్సాయిపల్లికి చెందిన వివాహిత జయమ్మ శనివారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తన ఇద్దరు చిన్న కూతుర్లతో వెళ్లిపోయింది. వెతికినా ఆచూకీ లభించలేదని భర్త మంతటి చిన్నయ్య ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్ఐ గోవర్ధన్ ఆదివారం తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పెద్దకొత్తపల్లి మండలంలో మరికల్ చెందిన జయమ్మకు చిన్నయ్యతో పదేళ్ల క్రితం వివాహమైంది.

రోడ్డు పక్కన నిద్రిస్తున్న వ్యక్తి పైనుంచి వెళ్లిన వాహనం

- అక్కడికక్కడే మృతి

షాద్‌నగర్ రూరల్, సెప్టెంబరు 29 : తమ్ముడికి కుమారుడు పుట్టాడన్న సంతోషంలో స్వగ్రామానికి వెళ్లిన వ్యక్తి తిరుగు ప్రయాణంలో రోడ్డ పక్కన పడుకోగా గుర్తు తెలియని వాహనం అతడి నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన షాద్‌నగర్ టోల్ ప్లాజా వద్ద శనివారం రాత్రి జరిగింది. ఏఎస్ఐ రాంచంద్రయ్య కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం మంగనూరు చెందిన గోపాసు శ్రీను (36) హైదరాబాద్‌లోని అంబర్‌పేటలో సెంట్రింగ్ కూలీగా పని చేస్తుంటాడు. స్వగ్రామంలో తమ్ముడికి కుమారుడు పుట్టడంతో శుక్రవారం గ్రామానికి వెళ్లాడు. అక్కడి నుంచి సాయంత్రం బయలు దేరాడు. చీకటి పడటంతో రాయికల్ టోల్ ప్లాజా వద్ద బైక్ రోడ్డు పక్కన నిలిపి నిద్ర పోయాడు. దీంతో గుర్తు తెలియని వాహనం అతడిపై నుంచి వెళ్లింది. అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తమ్ముడు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

తీన్మార్ మల్లన్నపై టీపీసీసీకి ఫిర్యాదు చేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డి

కల్వకుర్తి, సెప్టెంబరు 29 : ఎన్నో పార్టీలు మారినా తీన్మార్ మల్లన్నను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకుని ఎమ్మెల్సీ టికెట్ ఇచ్చి గెలిపిస్తే ఆ పార్టీ నేతల్నే టార్గెట్ చేస్తూ మాట్లాడటం ఎంత వరకు సమంజసమని కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డి, కల్వకుర్తి పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి ప్రశ్నించారు. తీన్మార్ మల్లన్నపై టీపీసీసీ అధిష్ఠానానికి ఫిర్యాదు చేయనున్నట్లు వారు పేర్కొన్నారు. కల్వకుర్తి పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డిలు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీగా ఉన్న తీన్మార్ మల్లన్న మరొక ప్రాంత సమావేశానికి వస్తే ఆ ప్రాంత నాయకులకు కనీస సమాచారం ఇవ్వలేదని అన్నారు. కల్వకుర్తిలో శనివారం జరిగిన బీసీ మహాసభ ధర్నాలో పాల్గొన్న తీన్మార్ మల్లన్న సీఎం రేవంత్‌రెడ్డిని, స్థానిక ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డిలను చులకనగా చేసి మాట్లాడటం సరైన పద్ధతి కాదని వారు విమర్శించారు. టీపీసీసీ అధిష్ఠానానికి ఫిర్యాదు చేయడం జరుగుతుందని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు పుస్తకాల రాహుల్, చంద్రకాంత్‌రెడ్డి, గణేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి



మహాజన సభ సమావేశంలో మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ జెల్ల గురువయ్యగౌడ్

చారకొండ, సెప్టెంబరు 29: దీర్ఘకాలిక రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో చెల్లిస్తే తిరిగి రైతులకు కొత్త రుణాలు ఇచ్చే అవకాశం ఉందని పీఏసీఎస్ చైర్మన్ జెల్ల గురువయ్యగౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో పీఏసీఎస్ చైర్మన్ జెల్ల గురువయ్యగౌడ్ ఆధ్వర్యంలో మహాజన సభ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సింగిల్‌విండో డైరెక్టర్లు, రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జెల్ల గురువయ్యగౌడ్ మాట్లాడుతూ సొసైటీలో మొత్తం 656 మంది రైతులకు గాను 363 మంది రైతులకు రూ. కోటీ 75 లక్షల, 48 వేల 275 రుణమాఫీ అయ్యాయని తెలిపారు. రూ. రెండు లక్షలకు పైగా రుణాలు ఉన్నవారు, ఆధార్ కార్డులలో తప్పులున్నవారు. రేషన్ కార్డులు లేనివారికి రుణమాఫీ కాలేదని, ప్రభుత్వం వారికి రుణాలు మంజూరు చేయగానే రుణమాఫీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. సొసైటీ పరిధిలో ఉన్న రైతులు ఫర్టిలైజర్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పీఏసీఎస్ వైస్‌చైర్మన్ బత్తిని కృష్ణారెడ్డి, డైరెక్టర్లు కొండలయ్యగౌడ్, జగన్‌మోహన్, రాజయ్య, సత్యం, రమేష్, పీఏసీఎస్ సీఈవో వెంకటయ్య, కార్యాలయ సిబ్బంది భీమయ్యగౌడ్, రైతులు సీహెచ్ శ్రీనివాసులు, ఆరేళ్ల పర్వతాలుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం

- జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సోలపోగుల స్వాములు



క్రీడలను ప్రారంభిస్తున్న నాయకులు

కల్వకుర్తి, సెప్టెంబరు 29 : క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ఉల్లాసం చేకూరుతుందని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సోలపోగుల స్వాములు, కాంగ్రెస్ నాయకుడు రవీందర్‌రావు అన్నారు. అక్టోబరు 7, 8 తేదీల్లో హన్మకొండలోని జేఎన్ స్టేడియంలో జరగబోయే 10వ తెలంగాణ స్టేట్ జూనియర్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ కొరకై కల్వకుర్తిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ సెలక్షన్స్ ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ స్వాములు, రవీందర్‌రావులు హాజరై క్రీడలను ప్రారంభించారు. అండర్-14,16,18,20ల వయో విభాగాల్లో నిర్వహించిన ఈ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి దాదాపు 200మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన 30మంది రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారని డాక్టర్ సోలపోగుల స్వాములు తెలిపారు. అనంతరం జిల్లా అథ్లెటిక్స్ సెలక్షన్స్‌లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు అసోసియేషన్ తరపున ప్రశంసా పత్రాలు అందజేశారు. కాంగ్రెస్ నాయకులు కటికె రామస్వామి, అథ్లెటిక్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు భిక్షపతి, జాయింట్ సెక్రటరీలు పరుశరామ్, పోలే అంజయ్య, ఫిజికల్ డైరెక్టర్లు ఎస్.ప్రసాద్, నర్సిరెడ్డి, కుమారస్వామి, రమేష్, బాలయ్య, స్వేరోస్ నాయకులు భీమయ్య, రాంచంద్రయ్య, ఎండి.తురాబ్, పీఈటీలు రాజేందర్, శ్రీను, వినోద్‌కుమార్, సైదులు, నరేష్, నిర్మల, రాధిక, తల్లిదండ్రులు లక్ష్మి, అరుణ, దేవమ్మ, ఝాన్సీరాణిలతోపాటు మాజీ క్రీడాకారులు, క్రీడాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

బస్సు సమయాలు మార్చాలి



డీఎంకు వినతి పత్రం అందజేస్తున్న ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర కమిటీ జీటీ శ్యామ్ అండ్ టీం జిల్లా అధ్యక్షుడు సాల్వాచారి టీమ్

తెలకపల్లి, సెప్టెంబరు 29: మండల పరిధిలోని లక్నారం గ్రామానికి అచ్చంపేట డిపో నుంచి వచ్చే బస్సు టైమింగ్ మార్చాలని ఆదివారం ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర కమిటీ జీటీ శ్యామ్ అండ్ టీం నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు అవంచ సాల్వాచారి టీమ్ అచ్చంపేట డిపో డీఎంకు వినతి పత్రం అందజేశారు. మూడు సంవత్సరాల నుంచి అచ్చంపేట నుంచి వచ్చే బస్సు 7:30గంటలకు లక్నారం చేరుకుంటుంది. ఈ టైంకు బస్సు వస్తే విద్యార్థులు తిని వెళ్లడానికి ఇబ్బందికరంగా ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్సు టైం మార్చి 8:30గంటలకు వచ్చే విధంగా ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. బస్సు మిస్ అయితే లక్నారం నుంచి గోలగుండం 3కిలో మీటర్లు రెగ్యులర్‌గా నడుచుకుంటూ వెళ్తున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం అచ్చంపేట డిపో డీఎం విద్యార్థులపై చొరవ చూపి బస్సు వేళలు మార్చాలని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం అచ్చంపేట డిపో డీఎం విద్యార్థులపై చొరవ చూపి బస్సువేళలు మార్చాలని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డీఎం ఈ విషయంపై సానుకూలంగా స్పందించి టైం మార్పునకు చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.

'కూలీ రేట్లు పెంచాలి'

వంగూరు, ఆగస్టు 29: పెరిగిన ధరలకు అనుగుణంగా కూలీలకు రేట్లు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు లక్ష్మయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని జాజాలలో కూలీ రేట్లపై ఆ సంఘం నాయకులు కూలీలతో సమావేశం నిర్వహించారు. గ్రామంలో కూలీ రేట్లకు ధరలను నిర్ణయించారు. రోజుకు రూ.500 కూలీ ఇవ్వాలని నిర్ణయించారు. నిత్యావసరాల సరకుల ధరలు పెరిగినందున పని చేసే ప్రతి కూలీకి రోజుకు రూ.ఐదు వందలు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. నాయకులు పరశురాములు, జంగయ్య, కొండల్‌రెడ్డి, కిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ రహదారులకు దిక్కెవరు?

- ఇటీవల భారీ వర్షాలతో కోతలకు గురైన రహదారులు
- నడవరాని స్థితిలో వాహనదారుల అయోమయం
- ఐతోల్, కొమ్ముకుంటతండాల మధ్యలో బురదమయంగా రహదారి



సిర్సవాడ, మాదారం గ్రామాల మధ్య దుందుభీ నదిలో పూర్తి స్థాయిలో దెబ్బతిన్న కాజ్‌వే



ఐతోల్, కొమ్ముకుంటతండాల మధ్యలో బురదమయంగా మారిన రహదారిపై నిరసన వ్యక్తం చేస్తున్న తండావాసులు(ఫైల్)

తాడూరు, సెప్టెంబరు 29 : ఈ సంవత్సరం వర్షాలు పరిమితికి మించి వర్షపాతం నమోదు కావడం మూలంగా గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులన్నీ వరదనీటి కోతకు గురై వాహనాల రాకపోకలతోపాటు మనుషులు సైతం నడవలేని స్థితిలో ఉందని ఆయా గ్రామాల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ఐతోల్ నుంచి తుమ్మల సూగూరు వెళ్లే ప్రధాన రహదారి ఇటీవల నూతనంగా బీటీ మంజూరయ్యింది. ఇందులో భాగంగా సంబంధిత కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే నిలిపివేయడం కారణంగా వర్షం వచ్చినప్పుడల్లా రహదారిపై మోకాళ్ల లోతు నీళ్లు మల్లుకుని ఉండటం మూలంగా కొమ్ము గుట్టతండాకు వెళ్లే ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇందుకు సంబంధించి రెండు రోజుల కిందట వారు రహదారిపై నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న ఈ రహదారి పనులను వెంటనే పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. దీనికితోడుగా నాగర్‌కర్నూల్, జడ్చర్ల ప్రధాన రహదారి సైతం వరద కోతకు గురి కాగా సిర్సవాడ నుంచి మాదా రంమీదుగా కల్వకుర్తి వెళ్లే ప్రధాన రహదారిపై దుందుభీ నదిలో కాజ్‌వే పూర్తి స్థాయిలో దెబ్బతిన్నది. దీనికారణంగా వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారు. భారీ వర్షాలతో రహదారులన్నీ కోతలకు గురైనప్పటికీ సంబంధిత శాఖ అధికారులు ఎలాంటి నివారణ చర్యలు తీసుకుని రహదారుల మరమ్మతులను చేపట్టకపోవడం మూలంగా గ్రామాల్లోని ప్రజలు వాహనదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ శాఖ అధికారులు స్పందించి కోతలకు గురైన రహదారులను వెంటనే మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆ రోడ్డును పూర్తి చేయాలి



ఇటీవల కురిసిన వర్షాలకు తండాలకు వెళ్లే రహదారులు బురదమయంగా మారాయి. కావున పంచాయతీరాజ్ అధికారులు స్పందించి కొమ్ముగుట్టతండాకు వెళ్లే రహదారిని వెంటనే బీటీ పనులను పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలి. రహదారులపై రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి.

- కుర్మయ్య, లచ్చిరాంతండా వాసి

విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ అందించడమే లక్ష్యం

- మంత్రి జూపల్లి కృష్ణారావు



కొల్లాపూర్‌లో ఆర్‌ఐడీ పునర్నిర్మాణ పనులను పరిశీలిస్తున్న రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్, సెప్టెంబరు 29 : నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న విద్యార్థులకు మెరుగైన విద్యనందించి వారికి ఉజ్వల భవిష్యత్ అందించడమే తమ లక్ష్యమని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. ఆదివారం కొల్లాపూర్ పట్టణంలోని రాణి ఇందిరాదేవి ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో కొనసాగుతున్న పాఠశాల పునర్నిర్మాణ పనులను మంత్రి జూపల్లి పరిశీలించారు. రాణి ఇందిరాదేవి ఉన్నత పాఠశాలను కార్పొరేట్ స్థాయి పాఠశాలగా తీర్చిదిద్దడం హర్షించదగ్గ విషయమని, తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. తన ఎమ్మెల్యే నిధులు అధిక శాతం నియోజకవర్గ విద్య అభివృద్ధి కోసమే ఖర్చు చేస్తున్నానని, విద్యతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు అందుతుందని, పట్టణ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పిస్తామని ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య అందేలా చర్యలు తీసుకుంటామని జూపల్లి పేర్కొన్నారు. అనంతరం ఆర్‌ఐడీ ఉన్నత పాఠశాల చుట్టూ ప్రహరీ గోడను నిర్మించాలని ఆయన గుత్తేదారులను ఆదేశించారు. ఆయనతోపాటు మునిసిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు అండగా ప్రభుత్వం

- ఆధార్ సెంటర్ ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



చెంచులకు కుల ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

పదర, సెప్టెంబరు 29: గిరిజనులందరికీ అండగా రాష్ట్ర ప్రభుత్వం ఉందని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. ఆయన ఆదివారం మండల కేంద్రంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత ఆధార్ సెంటర్‌ను ప్రారంభించి మాట్లాడారు. నల్లమలలో అత్యంత వెనుకబడిన చెంచుగిరిజనులకు కనీసం ఆధార్ కార్డు ఇవ్వడంలో కూడా గత ప్రభుత్వాలు విఫలమైనని గుర్తు చేశారు. అందుకు భిన్నంగా ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివాసులందరికీ ఆధార్‌తో పాటు రేషన్, కుల, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను స్పెషల్‌డ్రైవ్ ద్వారా అందిస్తున్నామన్నారు.

నల్లమలలోని నర్సింహులవాగు, గన్నపెంట, గీసుగండీ, అంతర్గంగ, పెద్దరేవు లాంటి ప్రసిద్ధ ప్రాంతాలకు విడతల వారిగా రోడ్లు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం చెంచులకు కుల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఆర్‌డీవో మాధవి, గిర్దావర్ మాచుపల్లి శేఖర్, ఆయా శాఖల అధికారులు, మండలాధ్యక్షుడు ఏఆర్ యాదవ్, మాజీ సర్పంచ్ ప్రేమ్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షరీఫ్, సీనియర్ నాయకుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతో భక్తి చాటాలి

కృష్ణుని భక్తులందరు సమన్వయంతో సంఘటితమై ఐక్యతతో భక్తి చాటాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. ఆయన ఆదివారం మండల కేంద్రంలో ఉన్న కృష్ణాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయంలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తవ్వడానికి రూపకల్పన చేయాలన్నారు. అందుకు తన వంతుగా రూ.10లక్షలను ఇస్తామన్నారు. ఆలయ అధ్యక్షుడు ఏఆర్ యాదవ్, చిన్నచంద్రయ్య ఎద్మ వెంకటయ్య, పుణ్యమూర్తి వెంకటయ్య, ముత్యాలు, మద్దిమడుగు డైరెక్టర్ హలరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని వంకేశ్వరంలో ఇటీవలే మృతి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బి.పర్వతాలు కుటుంబాన్ని పరామర్శించి పార్టీ అన్ని విధాల అండగా ఉంటుందని ధైర్యమిచ్చారు.

వ్యవసాయ రంగంలో అభివృద్ధి సాధించాలి

మన్ననూర్: నల్లమల అభయారణ్య ప్రాంతంలో నివసించే చెంచులు వ్యవసాయ రంగంలో అభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. జాతీయ మొక్కల జన్యువనరుల బ్యూరో హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయం శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో 200 మంది చెంచులకు ఆదివారం నిర్వహించిన వ్యవసాయ పరికరాల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఔషధ మొక్కల ద్వారా ఉత్పత్తి అయినటువంటి పప్పు దినుసుల ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బిందు సేద్యంలో పంటల సాగు విధానం, భూగర్భ జలాలు అడుగంటిన సందర్భాల్లో నీటి ఎద్దడిని తట్టుకొని సాగు పద్ధతులపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రభుత్వం చెంచుల అభివృద్ధికి కట్టుబడి ఉందని, చెంచు పెంటలకు అవసరమైన చోట మెటల్ రోడ్లను ఏర్పాటు చేస్తామని, చెంచులందరికీ త్వరలోనే ఫ్యామిలీ డిజిటల్ కార్డులను పంపిణీ చేస్తామని అన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు ఇచ్చే సూచనల మేరకు చెంచులు పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. రూ. 15లక్షల వ్యయంతో చెంచులకు వ్యవసాయ పనిముట్లను అందజేసిన వ్యవసాయ శాస్త్రవేత్తలను ఎమ్మెల్యే అభినందించారు.

ఎంపీడీవో వెంకటయ్య పంచాయతీ కార్యదర్శి భీముడు నాయక్, వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ శివ రాజన్, డాక్టర్ వీకే సింఘ్, డాక్టర్ సీలియా చలం , ఎంపీటీసీ మాజీ సభ్యులు దాసరి శ్రీనివాసులు, బాలమ్మ, కోఆప్షన్ మాజీ సభ్యుడు రహీం, కాంగ్రెస్ నాయకులు తుల్యా, సంబు వెంకట్‌రమణ, రాజేంద్రప్రసాద్ , జూలూరి సత్యనారాయణ, రహిమాన్, రాజారాం, బుచ్చయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విశ్వహిందూ పరిషత్ విస్తృత స్థాయి సమావేశం



మాట్లాడుతున్న ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శశిధర్

బిజినేపల్లి, సెప్టెంబరు 29 : మండలంలోని వట్టెం అడ్డగట్టుపై వెలిసిన గోదా లక్ష్మి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయం ప్రాంగణంలోని కల్యాణ మండపంలో ఆదివారం విశ్వహిందూ పరిషత్ విస్తృత స్థాయి జిల్లా సమావేశం నిర్వహించి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శశిధర్ మాట్లాడారు. హిందూ ధర్మ పరిరక్షణకు, సనా తన ధర్మం కాపాడటానికి తీసుకోవాల్సిన కార్యాచరణ గురించి సభ్యుల సలహాలు, సూచనలు తీసుకొని ముందుకు వెళ్లనున్నట్లు పేర్కొన్నారు. తిరుమల తిరుపతి వెంకన్న లడ్డూ కల్తీ అరికట్టడంలో, ధర్మ పరిరక్షణలో యువత పాత్రపై విస్తృతం గా చర్చించారు. జిల్లా అధ్యక్షుడు శివయ్య గౌడ్, ప్రఖండ అధ్యక్షుడు కర్నాటి తిరు పతయ్య, తాడూరు, అచ్చంపేట, మద్దిమడుగు, నాగర్‌కర్నూల్ ప్రాంతాల నుంచి సుధాకర్, నారాయణ రెడ్డి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మామిడితోటల పెంపకంపై అవగాహన

కోడేరు, సెప్టెంబరు 29 : మామిడి తోటల్లో పూతకు ముందు మరియు పూతదశలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు, తీసుకోవాల్సిన చర్యలపైన మామిడి తోటల పెంపకం రైతులకు అవగాహన కార్యక్రమం మంగళవారం మండల పరిధిలోని నర్సాయిపల్లి రైతు వేదిక ఆవరణలో నిర్వహించనున్నట్లు కొల్లాపూర్ ఉద్యానవన అధికారి ఎం.లక్ష్మణ్ తెలిపారు. వచ్చే నెల 1వ తేదీన మామిడి తోటల పెంపకంపై కేవీకే పాలెం ఉద్యాన శాస్త్రవేత్తలు పాల్గొని శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. మామిడి తోటల పెంపకంపై రైతులు మంగళవారం ఉదయం 9గంటలకు రైతు వేదిక ఆవరణకు చేరుకోగలరని అన్నారు. ఈ అవకాశం రైతులు సద్వినియోగం చేసుకోవాలని అధిక సంఖ్యలో పాల్గొన్నాలన్నారు.

కృష్ణానదిలో చేప పిల్లలు వదలాలి

పెంట్లవెల్లి, సెప్టెంబరు 29: కృష్ణానదిలో చేప పిల్లలను వదలాలని కృష్ణానది తీర గ్రామాల మత్స్యశాఖ అధ్యక్షుడు గోవిందు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మంచాలకట్టలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం ఆగస్టు, సెప్టెంబరు నెలలో కృష్ణానదిలో చేపలు అధికారులు వదులుతారని వారన్నారు. కానీ ఈ సంవత్సరం కృష్ణానది నిండుగా ఉండి మూడు నెలలు కావస్తున్నా ఇంత వరకు కూడా చేప పిల్లలను వదలలేదన్నారు. నది ప్రవాహం కూడా తగ్గిందని వారు పేర్కొన్నారు. అధికారులు చొరవ చూపి కృష్ణానదిలో చిన్న చేపలు వదలాలని వారు కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

తెలకపల్లి, సెప్టెంబరు 29 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1990-91బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ అపూర్వ సమ్మేళనం ఒకే వేదికపై కలుసుకుని 36 సంవత్సరాల క్రితం పదవ తరగతి పూర్తి చేసుకున్న సందర్భంగా వారి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయండి



నాగర్‌కర్నూల్‌లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల కరపత్రాన్ని విడుదల చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

నాగర్‌కర్నూల్ టౌన్, సెప్టెంబరు 29: జిల్లా కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో దసరా ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే 54వ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బిల్లకంటి హరిబాబు కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల కరపత్రాలకు అమ్మవారి వద్ద పూజలు చేసి విడుదల చేశారు. ఈ సందర్భంగా బిల్లకంటి హరిబాబు మాట్లాడుతూ అక్టోబరు 3న మార్కెట్ శివాలయం నుంచి నిర్వహించే శోభాయాత్రకు పట్టణ ఆర్యవైశ్యులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఆకుతోట మధుమోహన్, నూరంపల్లి రాధాకృష్ణ, కొత్ర బలరాముడు, డీవీ నారాయణ, పూరి శరత్‌బాబు, మిడిదొడ్డి నీలకంఠ, బాదం పరమేష్, మలిపెద్ది చంద్రశేఖర్, రాఘవేందర్, వాసుబాబు, కిషోర్, శివకుమార్, మాచిపెద్ది సాయిశంకర్, కొక్కంటి శ్రీనివాసులు, మిడిదొడ్డి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

'పాలిటెక్నిక్ కాలేజ్ ఏర్పాటు చేయాలి'

పదర, సెప్టెంబరు 29: అప్పర్‌ప్లాట్(అమ్రాబాద్,పదర మండలాలు)లో పాలిటెక్నిక్ కాలేజ్ ఏర్పాటు చేయాలని అప్పర్ ప్లాట్ మైనార్టీ సంఘం విద్యార్థి అధ్యక్షుడు ఎండీ గౌస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోనే విద్యా పరంగా అత్యంత వెనుకబడిన ప్రాంతం అమ్రాబాద్, పదర మండలాలని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో డాక్టర్ వంశీకృష్ణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే డిగ్రీ కళాశాల మంజూరు చేయించారని హర్షిస్తున్నట్లు పేర్కొన్నారు ప్రస్తుతం అచ్చంపేట నియోజకవర్గ బిడ్డనే రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో ఉన్నాడు కాబట్టి ఇప్పుడు పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేసి అప్పర్ ప్రాంతాన్ని విద్యా పరంగా అత్యున్నత స్థాయికి తీసుకవెళ్లాలని కోరారు.

రాజేందర్‌ను సన్మానించిన నాయకులు



జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా ఎన్నికైన అడ్వకేట్ రాజేందర్‌ను సన్మానిస్తున్న నాయకులు

అచ్చంపేటటౌన్, సెప్టెంబరు 28: జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా అచ్చంపేట ప్రాంతానికి చెందిన అడ్వకేట్ రాజేందర్ ఎన్నికైన సందర్భంగా ఆదివారం అచ్చంపేటకు చెందిన కాంగ్రెస్ నాయకులు మహబూబ్‌అలీతో పాటు పలువురు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డ ప్రతీ కర్యకర్తను ముఖ్యమంత్రి రేవంత్, ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణలు గుర్తింపుతో పదవులు ఇస్తున్నారన్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో అచ్చంపేటలో కీలకంగా వ్యవహరించిన అడ్వకేట్ రాజేందర్‌కు గ్రంథాలయ చైర్మన్ పదవి దక్కడం చాలా సంతోషకరమన్నారు. కాంగ్రెస్ నాయకులు రాజు, స్వామి, రఘు, రామస్వామి పాల్గొన్నారు.

పరిమితికి మించి ఎక్కించుకోవద్దు

పెద్దకొత్తపల్లి, సెప్టెంబరు 29 : ప్రైవేట్ వాహనదారులు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని ఎస్‌ఐ వి.సతీష్ అన్నారు. ఆదివారం పెద్దకొత్తపల్లి నుంచి నాయినోనిపల్లి మైసమ్మకు వెళ్లే రహదారిపై ఆయన వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోలు, జీపులు, వాహనదారులు పరిమితికి మించి ఎక్కువ మంది ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్లరాదని ఆయన సూచించారు. అధికంగా ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్తే ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలున్నాయని ఆయన పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆయన సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని ఆయన సూచించారు. రోడ్డు నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఉద్యోగులకు బదిలీలు సహజం

లింగాల, సెప్టెంబరు 29 : ఏ ఉద్యోగంలోనైనా బదిలీలు సహజమని కానీ తాను చేసే పనితీరు బట్టి అక్కడి ప్రజల మనసులో ఉండిపోతారని సింగిల్ విండో అధ్యక్షుడు హనుమంత్‌రెడ్డి, ఎస్‌ఐ జగన్మోహన్ అన్నారు. బదిలీపై అలంపూర్‌కు వెళ్లిన మండల వ్యవసాయ అధికారి నాగార్జునరెడ్డి ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఆదివారం లింగాల రైతు వేదికలో నిర్వహించారు.

ఈ సందర్భంగా సింగిల్ విండో అధ్యక్షుడు హనుమంతరెడ్డి, ఎస్‌ఐ జగన్మోహన్ మాట్లాడారు. అనంతరం వివిధ పార్టీల నాయకులు, రైతులు, ఫర్టిలైజర్ డీలర్లు ఆయనను ఘనంగా సన్మానించారు. మాజీ వైస్ ఎంపీపీ నారాయణగౌడ్, మాజీ సింగిల్ అధ్యక్షుడు కొండల్‌రావు, మాజీ సర్పంచ్ కోనేటి తిరుపతయ్య కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, కాంగ్రెస్ మండల మహిళా అధ్యక్షురాలు ఇందిరమ్మ, నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉల్లంగుండ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

'నూతన బ్రిడ్జి నిర్మించాలి'

పెంట్లవెల్లి, సెప్టెంబరు 29: శిథిలావస్థకు చేరిన బ్రిడ్జిని తొలగించి నూతనంగా నిర్మాణం చేపట్టాలని బీజేపీ మండల నాయకుడు కంటె వెంకటస్వామి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పెంట్లవెల్లి నుంచి పెబ్బేరుకు వెళ్లే మధ్యలో కృష్ణానదిపై ఉన్న బ్రిడ్జి శిథిలావస్థకు చేరడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారన్నారు. 40 సంవత్సరాల క్రితం నిర్మించిన బ్రిడ్జి కావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వారు పేర్కొన్నారు. బ్రిడ్జిపై అక్కడక్కడ పెచ్చులు ఊడి ఇనుప చువ్వలు తేలాయని వారన్నారు. గతంలో ఎన్నోసార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి నూతన బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని వారు కోరారు.

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు

నాగర్‌కర్నూల్ టౌన్, సెప్టెంబరు 29: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆ సంఘం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒప్పందం, పొరుగు సేవల పేరుతో ఉద్యోగులను నియమించుకొన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారిని క్రమబద్ధీకరించుకుండా శ్రమ దోపిడీ చేయించుకుంటున్నాయని ఆరోపించారు. పనికి తగిన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నత న్యాయస్థానం ఆదేశాలను పాటించకపోవడం సరికాదన్నారు.

ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగులకు 2012లో చివరిగా వేతన సవరణ జరిగిందని, ఆ తర్వాత ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. కార్మిక చట్టాలను అమలు చేయాలని, ఎన్నో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించిన ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వాలు తక్షణమే స్పందించి ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగులను క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు, అధ్యక్షుడు ఆంజనేయులు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షుడు వర్గం పర్వతాలు, ఈశ్వర్, నాయకులు రామయ్య, మల్లేష్, దశరథం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఉప్పునుంతల, సెప్టెంబరు 23: మండలంలోని అన్ని గ్రామపంచాయతీ జీపీ ఎంపీడబ్ల్యూ వర్కర్స్ మెడికల్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో మోహన్‌లాల్ ఆదివారం ఒక ప్రకటలో తెలిపారు. మండల కేంద్రమైన ఉప్పునుంతలలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్న మెడికల్ క్యాంప్‌ను 27 గ్రామపంచాయితీ సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.